ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శనివారం 24 ఆగస్టు 2024

డ్రైవింగ్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ఆమనగల్లు , ఆగస్టు 23: షెడ్యూల్ కులాల సేవాసహకార అభివృద్ధి సంస్థ ద్వారా ఎస్సీ నిరుద్యోగ యువకులకు డ్రైవింగ్ ఉచిత శిక్షణనిస్తున్నట్లు ఎంపీడీవో కుసుమ మాధురి తెలిపారు. 20 ఏళ్లు పైబడిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. హకీంపేటలో 38 రోజులు శిక్షణ ఇవ్వనున్నారని, అనంతరం పర్మినెంట్ లైసెన్స్ ఇప్పిస్తామని వెల్లడించారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు భోజనం, వసతి కల్పిస్తామని వివరించారు. ఆసక్తి గల యువకులు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో కుల, ఆదాయ, రేషన్‌కార్డు, ఆధార్, మూడు ఫొటోలతో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

కొత్త పరిశ్రమలు తెస్తాం.. ఉద్యోగాలు కల్పిస్తాం

» రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



కేన్స్ ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, సభలో మాట్లాడుతున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం/ఆదిభట్ల, ఆగస్టు 23: కొత్తగా పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలు కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు అన్నారు. నైపుణ్యం లేకే చాలావరకు యువత ఉద్యోగాలకు దూరంగా ఉన్నారన్నారు. అందుకే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి మార్పు తీసుకు రాబోతున్నామని అన్నారు. ఆదిభట్ల మండలం కొంగరకలాన్‌లో కేన్స్ ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాల కల్పన కోసం సీఎం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో ఫోర్త్ సిటీ రూపుదిద్దుకోనుందన్నారు. ఈ ప్రభుత్వం మంచి ఆలోచనతో ముందుకు పోతుందన్నారు. కాలుష్యం లేని పరిశ్రమలు వస్తేనే అభివృద్ధితో పాటు యువకు ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. కేన్స్ ఎలక్ట్రానిక్స్ సంస్థలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని యాజమాన్యానికి సూచించారు. పదేళ్లలో ఎంతో వెనకబాటుకు గురయ్యామని.. ఈ ప్రభుత్వంలో మార్పు చూడబోతున్నామన్నారు. బేగరికంచ స్కిల్ యూనివర్శిటీ వరకు 200 ఫీట్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణం జరగనుందని.. మెట్రో లైన్ కూడా రానుందని ఎమ్మెల్యే చెప్పారు. దీంతో ఈ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందనుందన్నారు. హైదరాబాద్‌కు నలువైపులా ఉన్న ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తగు ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. మున్ముందు మరిన్ని పరిశ్రమలు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ శశాంక, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, కేన్స్ టెక్నాలజీ సంస్థ చైర్‌పర్సన్ సవితా రమేష్, ఎండీ రమేష్ కున్హికన్నన్, సీఈవో జైరామ్ పి.సంపత్, ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పోలీసులు పట్టుకున్న గంజాయి

60 కిలోల గంజాయి పట్టివేత

యాచారం, ఆగస్టు 23: ఏపీనుంచి హైదరాబాద్‌కు అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠాను గురువారం సాయంత్రం యాచారం పోలీసులు, మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. యాచారం మండలం మాల్ చెక్ పోస్టు వద్ద 60కిలోల 420 గ్రాముల గంజాయితో పాటు (ఏపీ 39హెచ్ డబ్ల్యూ 0623) కారు, రెండు సెల్ ఫోన్లతో పాటు ఇరువురిని అదుపులోకి తీసుకొని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఆలంపట్టు గ్రామం హుకుంపేట మండలం అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన కొర్రబాబురావు, బొడ్డిగూడగ్రామం. దుమురిగూడమండలానికి చెందిన బురడికామేశ్వర్‌రావులు, వృత్తిరీత్యా వ్యవసాయం చేస్తారు. విశాఖపట్నంజిల్లా గోపాలపురానికి చెందిన షేక్ మస్తాన్‌అలీ, వెంకోజుపాలానికి చెందిన దుడ్డు మహేశ్వర్‌రావు, వేములపుడి గ్రామం నర్సీపట్నం మండలానికి చెందిన శ్రీనివాస్‌నాయుడు, గిరీష్ కలిసి ముఠాగా ఏర్పడ్డారు. గోప్యంగా గంజాయి వ్యాపారం కొనసాగిస్తున్నారు. కొర్రబాబురావు, బురడికామేశ్వర్‌రావులు పది క్వింటాళ్ల గంజాయి రవాణాకు ఒప్పందం చేసుకున్నారు. ఈ నెల 20న వారు ఏపీలో గంజాయిని ప్యాక్ చేసి హైదరాబాద్‌కు కారులో తరలిస్తున్నారు. మిగిలిన వారు నగరంలో గంజాయిని విక్రయించేందుకు బల్దేరారు. కాగా యాచారం మండలంలోని మాల్‌లో మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు, యాచారం పోలీసులు కారును తనిఖీ చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. షేక్‌మస్తాన్ అలీ, దుడ్డు మహేశ్వర్‌రావు, శ్రీనివాస్ నాయుడు గిరీష్ కోసం గాలిస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ వెల్లడించారు.

ఎల్‌ఆర్‌ఎస్ షురూ..!

ముమ్మరంగా దరఖాస్తుల పరిశీలన

రెగ్యులరైజ్ కోసం 3,00,887 అప్లికేషన్లు

జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచాయతీలతో పాటు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కొనుగోలు చేసిన ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు గత బీఆర్‌ఎస్ సర్కారు ఎల్‌ఆర్‌ఎస్‌ను తీసుకువచ్చింది. దీంతో కొంత సొమ్ము చెల్లించి భారీగా దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పుడు వాటికి అనుమతులు ఇచ్చేందుకు రేవంత్ సర్కారు ముందుకు వచ్చింది. దీనిలో భాగంగా ఆ దరఖాస్తులను పరిశీలించే పనిలో పడింది. కేవలం రెండు రోజుల్లోనే 320 దాకా దరఖాస్తులను పరిశీలించారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో సాగుతున్న ఈ ప్రక్రియను తొందరగానే ముగించేందుకు అధికార యంత్రాంగం సత్వర చర్యలు తీసుకుంటుంది.

స్వీకరించిన దరఖాస్తులు : 2,37,259
ఆమోదించినవి : 3,458
తిరస్కరించినవి : 1,218
నిషేధించినవి : 35,837
అధికారుల వద్ద పెండింగ్ : 1,96,154
పేమెంట్ కోసం ఆమోదించినవి : 2,348
రుసుము చెల్లించినవి : 1,110
ఫీజు చెల్లింపు పెండింగ్ : 2,348
గ్రామ పంచాయతీలో స్వీకరించిన దరఖాస్తులు : 63,630



శంకర్‌పల్లి మున్సిపాలిటీలో అక్రమ లే అవుట్ల వివరాలను మొబైల్ యాప్ ద్వారా పరిశీలిస్తున్న అధికారులు

» తొలుత మున్సిపల్ ప్రాంతాల్లో పరిశీలన
» క్షేత్రస్థాయి పరిశీలనలో నిమగ్నమైన అధికారులు
» అర్హతగల అప్లికేషన్లు ఆన్‌లైన్‌లో నమోదు
» అన్నీ సక్రమంగా ఉంటే అనుమతులు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 23 : జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ మొదలైంది. అధికారులు మున్సిపాలిటీల్లో పర్యటిస్తున్నారు. మొదటి దశలో క్షేత్రస్థాయిలో క్షుణంగా పరిశీలిస్తున్నారు. ముందుగా (సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన మొబైల్ యాప్ ద్వారా పరిశీలన జరుగుతోంది. సర్వే నెంబర్ వారీగా సంబంధిత రెవెన్యూ గ్రామం లేదా మున్సిపాలిటీలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్, నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్లతో ఏర్పాటు చేసిన బృందం పరిశీలిస్తోంది. ఈ బృందం జీపీఎస్ ద్వారా సదరు భూమి హద్దులు, ఇతర సమాచారాన్ని మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తోంది. అదే సమయంలో ఈ భూములు నీటి వనరులు బఫర్ జోన్, నాలా, చెరువులు, గవర్నమెంట్ ల్యాండ్ పరిధిలోనివి కావని ఈ బృందం ధ్రువీకరించాల్సి ఉంటుంది.

3,00,887 దరఖాస్తులు..

లే అవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2020లో దరఖాస్తులను ఆహ్వానించింది. 2020 ఆగస్టు 26 కంటే ముందుగా కొనుగోలు చేసిన ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందుకోసం ప్లాట్‌కు వెయ్యి రూపాయలు, వెంచర్‌కు పది వేలుగా ఫీజు నిర్ణయించింది. దీంతో లే అవుట్ల క్రమబద్ధీకరణకు భారీ స్పందన లభించింది. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, పంచాయతీల నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని 13 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లలో 2,37,259 దరఖాస్తులు స్వీకరించగా పంచాయతీల్లో 63,630 దరఖాస్తులు స్వీకరించారు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు కలుపుకుని మొత్తం 3,00,887 దరఖాస్తులు స్వీకరించారు.



కొత్తూరు మున్సిపాలిటీలో ఎల్‌ఆర్‌ఎస్ వివరాలను మొబైల్ యాప్‌లో పొందుపరుస్తున్న అధికారులు

మరో అవకాశం ఇవ్వాలని వినతి

జిల్లాలోని పంచాయతీలు, మున్సిపాలిటీల్లో అడ్డగోలుగా అనధికార లే అవుట్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎయిర్‌పోర్టు, పరిశ్రమలు, ఔటర్ రింగ్‌రోడ్డుకు దగ్గరగా వెంచర్లు ఉన్నాయంటూ ధరలు పెంచి అమ్మేశారు. ఆ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసి క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకోని వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారందరికీ మరో అవకాశం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

పకడ్బందీగా రెండు, మూడు దశలు..

నిబంధనలకు అనుగుణంగా ఉన్న స్థలాలకు మాత్రమే అనుమతులు లభించేలా ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించింది. ఈ క్రమంలో రెండు, మూడు దశల్లో పకడ్బందీగా పరిశీలన చేపట్టనున్నారు. రెండో దశలో దరఖాస్తులు స్థానిక సంస్థల నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? రోడ్డు వెడల్పు, ఖాళీ స్థలం తదితర నిబంధనలు లే అవుట్‌లో పాటించారా? అనే అంశాలను పరిశీలించి టౌన్ ప్లానింగ్ అధికారి ఆమోదిస్తారు. దీంతో ఇందుకు సంబంధించిన ఫీజు జనరేట్ అవుతుంది. ఈ విషయాన్ని దరఖాస్తు దారులకు తెలియజేసి, ఫీజు చెల్లించిన తర్వాత మూడో దశకు దరఖాస్తులు వెళతాయి. వీటిలో ఒక శాతం దరఖాస్తులను డిప్యూటీ తహసీల్దార్ క్రాస్ చెక్ చేస్తారు. మూడో దశలో దరఖాస్తులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఇతర అధికారులు పరిశీలించి ధ్రువీకరిస్తారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, గ్రామ పంచాయతీల్లోని దరఖాస్తులను కూడ అదనపు కలెక్టర్ ధ్రువీకరిస్తారు. దీంతో ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్‌లు జారీ అవుతాయి.

మున్సిపాలిటీ/కార్పొరేషన్‌లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల వివరాలు..

మున్సిపాలిటీ/కార్పొరేషన్	స్వీకరించినవి	అమోదించినవి	తిరస్కరించినవి	నిషేధించినవి	అధికారుల వద్ద పెండింగ్
ఆదిభట్ల	14,892	431	225	1,344	12,886
ఆమనగల్లు	3,561	1,413	08	190	1,898
ఇబ్రహీంపట్నం	16,345	102	03	341	15,890
జల్‌పల్లి	10,892	218	342	2,657	7,659
కొత్తూరు	3,956	26	0	172	3,755
మణికొండ	2,591	25	01	107	3,432
నార్సింగి	3,354	38	86	722	2,482
పెద్ద అంబర్‌పేట్	43,459	129	48	8,885	34,282
షాద్‌నగర్	15,466	230	11	2,220	13,002
శంషాబాద్	6,791	0	0	936	5,855
శంకర్‌పల్లి	4,770	120	101	781	3,767
తుక్కుగూడ	2,541	21	01	169	2,337
తుర్కయంజాల్	49,686	105	294	4,,776	44,510
బడంగ్‌పేట్	47,790	240	24	9054	38,397
బండ్లగూడ జాగీర్	7,753	273	10	2,258	5,018
మీర్‌పేట్	3,412	87	64	1,225	1,984

జిల్లా సహకార అధికారిగా సుధాకర్.. బాధ్యతల స్వీకరణ



సుధాకర్‌కు పూలమొక్కతో స్వాగతం పలుకుతున్న సహకార ఉద్యోగులు

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 23 : జిల్లా సహకార శాఖ అధికారిగా సుధాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు అధికారులు, ఉద్యోగులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ తన బాధ్యతలను అంకిత భావంతో నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సహకార శాఖ అధికారులు సత్యనారాయణరెడ్డి, మాధవ రెడ్డి, విజయ, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం లేదని పాఠశాలలోకి అనుమతి నిరాకరణ

» 30 మంది విద్యార్థులను తిప్పి పంపిన హెచ్‌ఎం



పాఠశాలలోకి అనుమతించకపోవడంతో దుకాణాల ఎదుట కూర్చున్న విద్యార్థులు

షాబాద్, ఆగస్టు 23 : రోజూ వర్షం కురుస్తోంది, వాతావరణం సహకరించడం లేదు, యూనిఫాం ఆరకపోవడం పిల్లలకు పనిష్మెంట్‌గా మారింది. షాబాద్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు యూనిఫామ్ ధరించలేదని ప్రధానోపాధ్యాయుడు గోవిందు కొన్ని రోజులుగా పాఠశాలలోకి వారికి అనుమతి ఇవ్వడం లేదు. ముఖ్యంగా వసతిగృహ విద్యార్థులకు ఈ ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయి. రోజుకు 30 నుంచి 40 మంది విద్యార్థులు పాఠశాలలోకి అనుమతి లేకపోవడంతో తరగతులు మిస్ అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూనిఫాం ఆరకపోవడంతో వేసుకొని రాలేదని ఎంత చెప్పినా వినలేదని విద్యార్థులు వాపోతున్నారు. శుక్రవారం కూడా హెచ్‌ఎం పాఠశాలలోకి అనుమతించకపోవడంతో విద్యార్థులు స్కూల్ బయట దుకాణాల సముదాయాల ఎదుట నిలబడి ఉన్నారు. విద్యార్థులను ఆరా తీయగా యూనిఫాం వేసుకు రాలేదని పాఠశాలకు రానివ్వడం లేదని వారు తెలిపారు.

కారణాలు నాకు అవసరం లేదు

ఒక్కో విద్యార్థికి రెండు యూనిఫాంలు పంపిణీ చేశాం, అయినా విద్యార్థులు యూనిఫాం వేసుకు రాకుండా సివిల్ డ్రెస్‌లో వస్తున్నారు. విద్యార్థులకు యూనిఫాం తప్పనిసరిగా ఉండాల్సిందే. ఎందుకు ధరించకుండా వస్తున్నారనేది నాకు అనవసరం.

గోవిందు, షాబాద్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం

విద్యార్థులను అనుమతించకపోవడం సరికాదు

విద్యార్థులకు యూనిఫాం లేదని పాఠశాలలోకి అనుమతించకపోవడం సరికాదు. ఒకటి రెండు సార్లు వారికి చెప్పి మార్పువచ్చే దిశగా ప్రయత్నం చేయాలి. పాఠశాలకు రావద్దన్నారన్న కారణంతో విద్యార్థులు ఎప్పుడూ సివిల్‌గా వచ్చే ప్రమాదం ఉంది. ఈ విషయం ఇదివరకే రెండుసార్లు మా దృష్టికి వచ్చింది. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తాం.

- శంకర్‌రాథోడ్, ఎంఈవో

పత్తా లేని ఫాగింగ్





కేశంపేట, చౌదరిగూడ మండలాల్లో మూలన పడిన ఫాగింగ్ మిషన్లు



చౌదరిగూడలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగునీరు

» వదలని దోమలు.. విడవని విష జ్వరాలు
» ఫాగింగ్‌కు నిధుల కొరత.. మూలన పడిన మిషన్లు
» రోగాలతో ఆస్పత్రులు కిటకిట

షాద్‌నగర్, ఆగస్టు 23: పంచాయతీల్లో పాలక వ్యవస్థ నిర్వీర్యమైంది. ఏ గ్రామంలో చూసినా దోమల పాలనే కొనసాగుతోంది. దోమల బెడదను నివారించేందుకు పంచాయతీల్లో ఉన్న ఫాంగింగ్ మిషన్లు నిధుల కొరతతో మూలన పడ్డాయి. దాంతో పాటు పారిశుధ్య పనులు కూడా అంతంత మాత్రంగానే నడుస్తున్నాయి. పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు, నిధులు కొరత, అందుబాటులో లేని స్పెషల్ ఆఫీసర్లు, అప్పుడప్పుడు వచ్చి పోయే కార్యదర్శులు. ఇలా దోమల బెడదకు ఎన్నెన్నో కారణాలు. విష జ్వరాలు, డెంగీ, గొంతు, ఒళ్లు నొప్పుల బాధతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి.



మురుగు కాల్వల దుస్థితి

ఫాగింగ్‌కు నిధుల్లేవ్

గ్రామీణ ప్రాంతాల్లో దోమలను నివారించేందుకు తరచుగా ఫాగింగ్ చేపడుతుండాలి. ఇందుకోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పంచాయతీ నిధుల నుంచి ఫాగింగ్ మిషన్లను కొనుగోలు చేశారు. కానీ వాటిని వినియోగించాలంటే పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేయాల్సిన అవసరం ఉంది. కానీ పంచాయతీ కార్మికులకే జీతాలు చెల్లించలేని పంచాయతీలు నిధుల కొరతతో ఫాగింగ్ మిషన్లను పక్కన పెట్టాయి. అప్పుడప్పుడు మాత్రం మండల కేంద్రంలో ఫాగింగ్ చేస్తున్నప్పటికీ దోమల బెడద మాత్రం తగ్గడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

రోజుకు రూ. 10వేల ఖర్చు

మండల కేంద్రంలో ఫాగింగ్ చేయాలంటే పెట్రోల్, కిరోసిన్, దోమల మందుకు రోజుకు రూ. 10వేల నుంచి రూ. 12వేల వరకు ఖర్చు అవుతుంది. గ్రామాల్లో అయితే రూ. 3వేల నుంచి రూ.5వేల వరకు ఖర్చు అవుతుంది. పంచాయతీల్లో నిధులు లేనందున గ్రామాల్లో ఫాగింగ్ అనే పదాన్నే మార్చారు. తాము సొంతంగా ఖర్చు చేయలేమని, ఎలాగూ మీకు పాత బిల్లులు రావాల్సి ఉన్నందున ఫాగింగ్‌కు అవసరమయ్యే ఖర్చును కూడా భరించి బిల్లులు పెట్టుకోవాల్సిందిగా తాజా మాజీ సర్పంచ్‌లను గ్రామ కార్యదర్శులు కోరుతున్నారు. పాత బిల్లులే రాక ఇబ్బంది పడుతుంటే ఈ బిల్లులను మేము భరించలేమంటూ వారు కూడా చేతులు ఎత్తేస్తున్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



రోగాలు విజృంభిస్తున్నాయి. ప్రాణాలు పోయేంత వరకు వేచి చూడకుండా దోమల నివారణకు చర్యలు చేపట్టాలి. ప్రస్తుత పరిస్థితుల్లో వారంలో మూడు రోజులు విధిగా ఫాగింగ్ చేయాలి. అలాగే ప్రతీరోజు గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి. స్పెషల్ ఆఫీసర్లు కూడా గ్రామాలను సందర్శించి ప్రజలు రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి.

- ఆజాం, వీరన్నపేట,చౌదరిగూడ మండలం

పారిశుధ్య పనులు అంతంతే..

షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో 6 మండలాలున్నాయి. ఇందులో ఫరూఖ్‌నగర్ మండలంలో 48 గ్రామ పంచాయతీలు, కొత్తూరు మండలంలో 12, నందిగామలో 19, కొందుర్గులో 22, చౌదరిగూడలో 24, కేశంపేటలో 29 గ్రామ పంచాయతీలున్నాయి. కానీ ఈ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో పారిశుధ్య పనులు నత్తనడకన నడుస్తున్నాయి. శుభ్రం చేసిన చెత్తను తీసుకువెళ్లే ట్రాక్టర్లలో కూడా డీజిల్ లేకపోవడం వల్ల అవి కూడా మూలన పడ్డాయి. దాంతో గ్రామాల్లో పారిశుధ్యం లోపించి ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు.

ప్రత్యేక నిధులు కేటాయించాలి

గ్రామాల్లో పారిశుధ్యం పనుల కోసం పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని గ్రామ కార్యదర్శులు కోరుతున్నారు. లేకుంటే గ్రామాలు మరింత అధ్వాన్నంగా మారే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

శామీర్‌పేట, ఆగస్టు 23: జడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. అలియాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని రుచిగా వండిపెట్టాలన్నారు. ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్‌ఎం, ఉపాధ్యాయులను, వంట మనుషులను హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం రోజూ ఎలా పెడుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పాఠశాల తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల రికార్డులను, మధ్యాహ్న భోజన రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. మీ భవిష్యత్ మీ చేతుల్లోనే ఉందని ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠ్యాంశాలను శ్రద్ధగా, క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ యాదగిరిరెడ్డి ఉన్నారు.



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ విజేయేందర్‌రెడ్డి



బోనాల ఉత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్

మైసమ్మ, ఎల్లమ్మకు బోనాలు

తరలివచ్చిన భక్తులు

కొత్తూర్, ఆగస్టు 23: కొత్తూర్ మున్సిపాలిటీలో శుక్రవారం రాత్రి మైసమ్మ, ఎల్లమ్మ బోనాల మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని సత్యసాయికాలనీలోని పోచమ్మ దేవాలయం నుంచి, మైసమ్మ కాలనీలోని మైసమ్మ దేవాలయంతో పాటు ఎల్లమ్మ దేవాలయం వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. డప్పు చప్పుళ్ల నడుమ పోతురాజుల నృత్యాలు, శివసత్తుల పూనకాలు నడుమ మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. విశ్వశాంతి యూత్ ఆధ్వర్యంలో ఫలహార బండిని ఊరేగింపు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్ బోనాల ఉత్సవానికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జె. వేణుగోపాల్‌గౌడ్, కడెంపల్లి సదానంద్‌గౌడ్, బాతుక లక్ష్మయ్యయాదవ్, జె. సుదర్శన్‌గౌడ్, మాదారం నర్సింహ్మగౌడ్, వీరమోని దేవేందర్‌ముదిరాజ్, జె. శ్రీను, బ్యాగరి యాదయ్య, జంగగళ్ల కృష్ణయ్య, మాసుల అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రవినాయక్, బండికృష్ణ, పేపర్ యాదయ్య, జహంగీర్‌జీ, గణేష్‌గౌడ్, రాఘవేందర్‌యాదవ్, విశ్వశాంతి యూత్ అధ్యక్షుడు నాగరాజు శర్మ, మేకల రవీందర్‌యాదవ్, రాజుయాదవ్, వేణుగోపాల్‌చారి, కుమార్‌యాదవ్, బండి శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న వేణుగోపాల్ గౌడ్ కుటుంబసభ్యులు

ప్రతీ విద్యార్థి లక్ష్యం దిశగా ముందుకెళ్లాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బుచ్చిబాబు

పెద్దేముల్, ఆగస్టు 23: ప్రతీ విద్యార్థి తాను నిర్దేశించుకున్న లక్ష్యందిగా ముందుకెళ్లాలని జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ బుచ్చిబాబు, మానసిక వైద్య నిపుణులు మనోజ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మెంటల్ అండ్ హెల్త్‌స్ట్రెస్ మేనేజ్మెంట్ ప్రోగ్రాంపై వారు విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుపైనే దృష్టిపెట్టి లక్ష్యాలు సాధించాలని తెలిపారు. మానసికంగా కుంగుబాటుకు గురికావద్దన్నారు. లక్ష్యం సాధించేందుకు ఎన్ని అడ్డంకులు వచ్చినా వాటిని తేలికగా తీసుకోవాలని చెప్పారు. ఒత్తిడికి గురైతే లక్ష్యాలు దూరమవుతాయని సూచించారు. ఒత్తిడి దరిచేరనీయకుండా ఉండేందుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మనస్తత్వవేత్త ప్రయా, కృష్ణకాంత్, ఏఎన్ఎం వెంకటమ్మ పాల్గొన్నారు.

హెల్ప్ లెస్ డెస్క్



ఖాళీగా కనిపిస్తున్న తాండూరు ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్

తాండూరు, ఆగస్టు 23: ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. సందేహాలు ఉన్న చాలా మంది సందేహాలను అడిగి తెలుసుకుందామనుకున్న వారికి నిరాశతో వెను తిరిగి వెళ్తున్నారు. తాండూరు మున్సిపాలిటీలో గురువారం ఏర్పాటు చేసిన ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ శుక్రవారం 24 గంటల్లోనే మూతపడినట్లు తెలుస్తోంది. మున్సిపాలిటీ ఆవరణలో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో టౌన్‌ప్లానింగ్ విభాగం చెందిన అధికారులు కూర్చోవాల్సి ఉంటుంది. అయితే ఖాళీ కుర్చీలు దర్శనమివ్వడంతో ప్రజలు తమ సందేహాలను ఎవరిని అడగాలని ప్రశ్నిస్తున్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా వేంకటేశ్వర ఆలయం

మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు



ఈశాన్య ద్వారాన్ని ప్రారంభిస్తున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్‌అర్బన్, ఆగస్టు 23: వెంకటేశ్వరస్వామి దేవాలయానికి దాతల సహకారంతోనే పూర్వవైభవం తీసుకువచ్చి, ఆధ్యాత్మిక కేంద్రంగా ముందుకు నడిపిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అభిప్రాయపడ్డారు. ఈశాన్య ద్వారాన్ని శుక్రవారం బక్కని నర్సింహులు ప్రారంభించారు. అలాగే ఉత్తర ద్వారంపై ప్రతిష్ఠించిన శ్రీ అనంత పద్మనాభస్వామి విగ్రహాలకు ప్రముఖ న్యాయవాది కంచి రాజ్‌గోపాల్ పూజచేసి, ఆవిష్కరించారు. ఆలయ భూమి పరిరక్షణ కోసం ప్రహరీ గేట్లను దండు శరత్‌చంద్రబాబు, ఎల్. మోహన్‌రెడ్డి, ఖాజాపాషలు ప్రారంభించారు. దాతలు ముందుకు రావడంతోనే ఆలయం అభివృద్ధి చెందుతూ భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా మారిందని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కానుగు అంతయ్య, టి. ప్రతాప్‌రెడ్డి, ఈగ వెంకట్‌రాంరెడ్డి, పాతూరి వెంకట్‌రావు, బి. జగన్‌మోహన్‌రెడ్డి, పరిగి వెంకట సాయిశ్వర్‌రెడ్డి, యాదవచారి, ఒగ్గు కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు ఎల్ఆర్ఎస్ స్పెషల్ డ్రైవ్

శామీర్‌పేట, ఆగస్టు 23: తూంకుంట మున్సిపల్ పరిధిలోని అంతాయిపల్లిలో గల ఎస్ఎస్ఆర్ లేఅవుట్ వెంచర్‌లో మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ ఆధ్వర్యంలో టీపీవో మణిహారిక ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల రెగ్యులరైజేషన్‌కు శుక్రవారం రెండో రోజు స్పెషల్ డ్రైవ్ క్యాంప్‌ను కొనసాగించారు. ఈ సందర్భంగా 2020వ సంవత్సరం వరకు హెచ్ఎండీఏ అనుమతులు లేకుండా కొనుగోలు చేసిన ప్లాట్లను రెగ్యులరైజ్ చేయడానికి పరిశీలిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, టీపీవో మణిహారిక తెలిపారు. ఈ క్యాంప్‌లో దాదాపు 50ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను, ప్లాట్ల డాక్యుమెంట్లను టీపీవో, అధికారుల బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. ప్లాట్ల యజమానులతో డాక్యుమెంట్ల పూర్వపరాలపై టీపీవో విచారణ జరిపారు. డాక్యుమెంట్లు ప్రభుత్వ నిబంధనల మేరకు సరిగ్గా ఉంటే రెగ్యులరైజ్ చేసేందుకు మూడు దశల్లో దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు డీపీవో తెలిపారు.

కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో కర్ణాటక మాజీ మంత్రి పూజలు



సర్టిఫికెట్ అందజేస్తున్న కర్ణాటక రాష్ట్ర మాజీ మంత్రి అరవిందలింబావళి

తాండూరు రూరల్, ఆగస్టు 23: తెలంగాణ-కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని తాండూరు మండలం కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మను కర్ణాటక రాష్ట్ర విద్యాశాఖ మాజీ మంత్రి అరవింద లింబావళి దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణమాసం సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో తైక్వాండో సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.

వాసవీ మాతకు మల్లెపూలతో అభిషేకం

- సామూహిక కుంకుమార్చన
- ఆలయాల్లో మహిళల సందడి



వాసవి మాతకు మల్లెపూలతో అలంకరణ

తాండూరు, ఆగస్టు 23: తాండూరు పట్టణ నగరేశ్వర ఆలయంలో కొలువైన ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన వాసవీ మాత వేడుకలు వైభవంగా నిర్వహించారు. శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని ఆర్యవైశ్య మహిళలు తరలిరావడంతో నగరేశ్వర ఆలయం, వాసవీ మాత అమ్మవారి ఆలయం మహిళలతో సందడిగా కనిపించింది. మహిళలు అమ్మవారికి మల్లెపూలతో ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వాసవీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుకలు భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మహిళలకు పోటీలు నిర్వహించి మహిళా సంఘం ఆధ్వర్యంలో బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొట్రిక విజయలక్ష్మి, వాసవీ మహిళా సంఘం అధ్యక్షురాలు కొట్రిక నాగలక్ష్మి, వాసవీ మహిళా సంఘం సభ్యులు సంధ్య, సరిత, గుబ్బ, ప్రగతి, శోభ, దీపా, శశిరేఖ, కల్వ అర్చన పాల్గొన్నారు. శ్రావణ మహలక్ష్మి బహుమతులు జి.సునిత, సంగీ తలను వరించగా పెద్ద ముత్తైదువు విభాగంలో మొదటి బహుమతి శంకరమ్మలకు దక్కింది.

స్నేహ మహిళా సొసైటీ అధ్యక్షురాలుగా కొలుకులపల్లి భారతి



కొలుకపల్లి భారతి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 23: ఇబ్రహీంపట్నం మండల స్నేహ మహిళా సొసైటీ అధ్యక్షురాలిగా కొలుకులపల్లి భారతి ఏకగ్రీవంగా ఎన్నికైనారు. శుక్రవారం సొసైటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అలాగే కార్యదర్శిగా అమృతను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికోసం కృషి చేస్తానన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించడానికి అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు.

తల్లడిల్లుతున్న తల్లులు, గర్భిణులు



అంగన్‌వాడీ కేంద్రం వద్దకు పిల్లలతో వచ్చిన తల్లులు

పార్కుస్థలం దక్కించుకునే ప్రయత్నాలు

ఉమానగర్‌కాలనీకి సంబంధించిన లేఅవుట్‌లో దాదాపు 250 చదరపు గజాల స్థలాన్ని పార్కు కోసం వదిలారు. కాగా పార్కుస్థలంలో కంచె ఏర్పాటు చేయకపోవటంతో పార్కుకు ఆనుకుని ఉన్న ప్లాట్ల యజమానులు పార్కుస్థలాన్ని కబ్జాచేసి ఇళ్లు నిర్మించుకున్నారు. పార్కుస్థలం కుదించుకుపోయి 100 గజాలకు చేరింది. దీంతో పార్కుస్థలాన్ని కాపాడుకోవటానికి కాలనీవాసులు అక్కడ రేకులషెడ్‌తో కమ్యూనిటీ హాల్, దాని పక్కన వినాయక మండపాన్ని నిర్మించారు. అంగన్‌వాడీ కోసం పక్కాభవనం ఏర్పాటుకు ప్రతిపాదనలు చేస్తున్నందున పార్కుస్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించే ఇష్టంలేక కొందరు కాలనీవాసులు నేరుగా అంగన్‌వాడీ కేంద్రాన్నే తరలించేందుకు పావులు కదుపుతున్నట్లు స్థానిక మహిళలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో ఐసీడీఎల్ అధికారులు మౌనం పాటించడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- అంగన్‌వాడీ కేంద్రం కూల్చివేత
- పిల్లలకు, గర్భిణులకు అందని పౌష్టికాహారం

మేడ్చల్ టౌన్, ఆగస్టు 23: మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్న కమ్యూనిటీ హాల్ భవనం కూల్చివేయడటంతో పిల్లలు, గర్భిణులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. పార్కుస్థలంలో కమ్యూనిటీ హాల్ భవనం నుంచి అంగన్‌వాడీ కేంద్రాన్ని తరలించాలన్న ఉద్దేశంతో చెప్పాపెట్టకుండా కాలనీ పెద్దలు భవనాన్ని కూల్చివేశారు. దీంతో పిల్లలు, గర్భిణు లకు పౌష్టికాహారం అందని పరిస్థితి నెలకొంది. మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు ఉమానగర్‌లో పార్కు స్థలంలో కాలనీ వాసులు సొసైటీ కోసం ఒకవైపు కమ్యూనిటీ హాల్ మరోవైపు వినాయక మండపాన్ని నిర్మించారు. అయితే ప్రజావసరాల దృష్ట్యా ఐసీడీఎస్ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు కాలనీవాసులతో మాట్లాడి 12 సంవత్సరాల కిందట కమ్యూనిటీ హాల్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రేకుల షెడ్డులో దీర్ఘ కాలంగా కొనసాగుతున్న ఈ అంగన్‌వాడీ కేంద్రాని కి పక్కా భవనం నిర్మించేందుకు ప్రభుత్వ హ యాంలో అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనను కాలనీవాసులు ఇష్టపడటంలేదు. అయినా అంగన్‌వాడీ కేంద్రాన్ని తరలించడానికే కమ్యూనిటీ హాల్‌ను నేలమట్టం చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గర్భిణులు, పిల్లలు పడుతున్న ఇబ్బందులను గ్రహించిన స్థానిక కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి తన సొంత భవనంలోకి అంగన్ వాడీ కేంద్రం ఏర్పాటు చేసుకోవాలని ఐసీడీఎస్ అధికారులను కోరినప్పటికీ వారు ఒప్పుకోలేదని స్థానికులు తెలిపారు.



ఉమానగర్‌లో అంగన్‌వాడీ భవనం కూలగొట్టి చదును చేసిన పార్కుస్థలం

పిల్లలు ఇళ్లకే పరిమితమయ్యారు



పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకెళ్లి పౌష్టికాహారం అందించే వీలు లేకుండా పోయింది. ఇతర వార్డుల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారులు చెప్తున్నారు. అయితే, ఇతర అంగన్‌వీడీ కేంద్రం అందుబాటులో లేక వెళ్లేందుకు వీలుపడక పిల్లలను ఇంటి వద్దే ఉంచాల్సివస్తోంది.

\- జి.వనిత, స్థానికురాలు

పక్కా భవనం ఏర్పాటు చేయాలి



కాలనీ మహిళలకు అందుబాటులో పక్కా భవనం ఏర్పాటు చేసి అంగన్ వాడీ కేంద్రాన్ని ప్రారంభించాలి. పౌష్టికాహారం కోసం పిల్లలు, గర్భిణులు దూరపు ప్రాంతాల్లో ఉన్న అంగన్ వాడీ కేంద్రాలకు వెళ్లి తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. పిల్లలను అం తదూరం తీసుకెళ్లలేకపోతున్నాం. అధికారులు స్పందించి వెంటనే అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించాలి.

\- మమత, స్థానికురాలు

ఆ స్థలంలోనే పక్కాభవనం నిర్మించాలి



భవనం కూలగొట్టిన స్థలంలోనే తిరిగి పక్కా భవనం నిర్మించి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. ప్రజలకు ఉపయోగపడే అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు పార్కుస్థలమే సరైనది. కట్టింది.. కూల్చింది కాలనీవాసులే కాబట్టి వారితో సంబంధం లేకుండా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కొత్త భవన నిర్మాణాన్ని చేపట్టాలి.

\- డి.రాజేశ్వరి, స్థానికురాలు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు



ఆమనగల్లులో విగ్రహప్రతిష్ఠ వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



మహాయజ్ఞంలో శ్రీ నారామణి పత్యంగీరా మహాదేవి , ఆచారి, భక్తులు

హాజరైన ఎమ్మెల్యే కసిరెడ్డి, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు ఆచారి

ఆమనగల్లు, ఆగస్టు23: ఆమనగల్లులోని కట్టమైసమ్మ దేవాలయంలో శుక్రవారం ఆలయ చైర్మన్, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మొక్తాల వెంకటయ్య ఆధ్వర్యంలోవిగ్రహప్రతిష్ఠ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి హాజరయ్యారు. శ్రీ సద్గురు శాంకరి అగోరి మాతా మహాగాయత్రి దేవి ఉపాసకురాలు నారాయణి పత్యంగీరా మాతాజీ పర్యవేక్షణలో అర్చకులు నాగభూషణం, శరత్‌చంద్ర, రామకృష్ణశర్మల ఆధ్వర్యంలో కట్టమైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శ్రీ నారాయణి పత్యంగిరా మహాయజ్ఞం చేపట్టారు. యజ్ఞంలో భక్తులు, మహిళలు వందలాదిగా పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ జడ్పీటీసీలు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, కండె హరిప్రసాద్, మాజీ ఎంపీపీ తల్లోజు లలితవెంకటయ్య, పాపిశెట్టి రాము శ్వేత, సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్సై వెంకటేశ్ , కౌన్సిలర్లు తల్లోజు విజయ్‌కృష్ణ, చెన్నకేశవులు, లక్ష్మణ్, ఝాన్సీశేఖర్, దివ్య శ్రీకాంత్‌సింగ్, దుడ్డు కృష్ణ, శ్రీధర్, మండ్లీ రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మ, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, జగన్, మానయ్య, గోరటి నర్సింహ్మ, మొక్తాల వెంకటయ్య, ఎర్రవోలు యాదయ్య, మొక్తాల చిన్న వెంకటయ్య, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి, ఆగస్టు 23: మండల పరిధిలోని చెన్నంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేద పండితులు యాదగిరి నర్సింహ్మయ్య శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమం, జలాదివాసం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అమ్మవారికి పూజలు నిర్వహించారు. దైవ కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు పాలు పంచుకోవాలని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేశ్ యాదవ్, నాయకులు లక్ష్మీనారాయణ గౌడ్, నరేందర్ గౌడ్, మస్కు వెంకటయ్య, శ్రీను, కృష్ణయ్య, తిరుపతయ్య, రామస్వామస్వామి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక చొరవ



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, ఆగస్టు23: మున్సిపల్ సిబ్బంది ఆరోగ్యం పట్ల ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు పోచారం మున్సిపల్ సిబ్బంది బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో శుక్రవారం సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన వైద్యశిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ సిబ్బందికి క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహిస్తూ వారికి అవసరమైన చికిత్సలు అందేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రధానంగా మున్సిపల్ సిబ్బంది ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని విధులు నిర్వహించే సమయంలో అన్ని రకాల జాగ్రత్తలు పాటించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 170మంది సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్డియానాయక్, కమిషనర్ వేమనరెడ్డి. కౌన్సిలర్లు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు రూ.70.20లక్షలు మంజూరు

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రత్నప్రసాద్



మురుగు కాల్వలో ఉన్న తాగునీటి పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న మిషన్ భగీరథ డీఈ రత్నప్రసాద్

ధారూరు, ఆగస్టు 23: ధారూరు పంచాయతీ పరిధిలో తాగునీటి సరఫరా కోసం ప్రభుత్వం రూ.70.20లక్షలు మంజూరు చేసిందని వికారాబాద్ డివిజన్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రత్నప్రసాద్ తెలిపారు. ఆయన ధారూరులోని వివిధ కాలనీల్లో శుక్రవారం పర్యటించి తాగునీటి సరఫరా పైప్‌లైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా తాగునీటి వసతి, ఇబ్బందులపై స్థానికులతో మాట్లాడారు. ధారూరు గ్రామంలో కొన్ని కాలనీల్లో మిషన్ భగీరథ పైపులైన్ వేయలేదని, కొన్ని కాలనీల్లో ఇళ్లకు తాగునీరు రావడం లేదని, మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడంలేదని కాంగ్రెస్ నాయకులు, ప్రజలు డీఈ దృష్టికి తెచ్చారు. ప్రత్యామ్నాయ సౌకర్యం లేక తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అనంతరం డీఈ రత్నప్రసాద్ మాట్లాడుతూ.. నీతి అయోగ్ ద్వారా తెలంగాణకు 1200 కోట్లు మంజూరుకాగా, ధారూరుకు రూ.57లక్షలు కేటాయించారని ఆయన చెప్పారు. ఈ నిధులతో ధారూరులో పాత తాగునీటి ట్యాంకును తొలగించి కొత్తగా 60కేవీ వాటర్ ట్యాంకును నిర్మించనున్నట్లు తెలిపారు. దీంతో పాటు 190నల్లా కనెక్షన్లు, 2కిలోమీటర్ల పైపులైన్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. ఎస్‌డీఎఫ్ ద్వారా 13.25 లక్షలు మంజూరు అయ్యాయని, ఈ నిధుల నుంచి రూ.5లక్షలతో 400 మీటర్ల తాగునీటి పైపులైన్ నిర్మాణం, రూ.5లక్షలతో రెండు బోర్‌వెల్స్, పంపుసెట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మరో రూ.3.20లక్షలతో ఎనిమిది బోర్ల ఫ్లషింగ్, డీపింగ్ పనులు చేయిస్తామని వివరించారు. త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేసి తాగునీటి సమస్య తీరుస్తామని తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత నీతిఅయోగ్ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. డీఈ వెంట పంచాయతీ కార్యదర్శి అంజా నాయక్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాల అమలుపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీటీడీవో రామేశ్వరి దేవి

కడ్తాల్, ఆగస్టు 23: చెంచుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు సకాలంలో వారికి చేరేలా, సక్రమంగా అమలయ్యేలా అన్ని శాఖల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రామేశ్వరి దేవి కోరారు. కడ్తాల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో సుజాత అధ్యక్షతన చెంచుల పథకాల అమలుపై చెంచు ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్, ఓటరు, ఈజీఎస్ జాబ్‌కార్డు, కిసాన్ క్రెడిట్, రేషన్‌కార్డు, కులధ్రువీకరణపత్రాలు ఇప్పటి వరకు పొందని వారు ఉంటే చెంచు ఆవాస ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు చెంచులంతా సద్వినియోగం చేసుకునేలా చూడాలని డీటీడీవో అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కడ్తాల మండల పరిధిలోని న్యామతాపూర్,అన్మాస్‌పల్లి, జమ్ములబావి తండా, మాదవపూర్, వాసుదేవ్‌పూర్, ముద్విన్, కర్కల్‌పహాడ్ చెంచు కాలనీలకు సంబందంచిన చెంచుల కోసం శుక్రవారం నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు ఆయా పంచాయతీ కార్యాలయాలలో ప్రత్యేక శిబిరాల ద్వారా ధరకాస్తులు స్వీకరించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీవో సుజాత, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్, ఏఈలు నరేందర్, పరమేశ్, శ్రావ్య, ఐకేపీ ఏపీఎం రాజేశ్వరి, మెడికల్ ఆఫీసర్ స్రవంతి, ఏపీవో లలిత, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం



నూతన బస్సును ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్‌లు కొండారెడ్డి,గణేష్ ముదిరాజ్

కందుకూరు, ఆగష్టు 23: గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన రవాణ సౌకర్యం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ప్రతి ఒక్కరూ ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేయాలని లేమూరు మాజీ సర్పంచ్ గూడూరు కొండారెడ్డి, ఢిల్లీ గణేష్‌ముదిరాజ్‌లు కోరారు. శుక్రవారం నగరంలోని ఉమెన్స్‌కాలేజీ నుంచి లేమూరు గ్రామం వరకు మిధానిడిపోకు చెందిన బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉమెన్స్ కాలేజీ నుంచి బస్సు సౌకర్యం లే క గ్రామస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గుర్తించి ప్రభుత్వం నూతనంగా బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.జైపాల్, జి.యాదయ్య, రాజు, గణేస్, మల్లేష్, క్రిష్ణ, కె.పొన్నమ్మ, కె.శైలజ తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సహకరించండి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు, ఆగస్టు, 23: మండలాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. మండల కేంద్రంలో నిర్మాణం చేయనున్న ఇంటిగ్రెటెడ్ స్కూల్, స్టేడియం ఏర్పాటుకు శుక్రవారం ఎమ్మెల్యే స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా స్టేడియం ఏర్పాటుకు మండల కేంద్రంలోని తూర్పు పట్టి సర్వేనెంబర్ 19లో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని, ఇంటిగ్రెటెడ్ స్కూల్ ఏర్పాటు కోసం పడమరపట్టిలో 109 సర్వేనెంబర్‌లో 16 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ షాద్‌నగర్ నుంచి పరిగి వరకు నాలుగులైన్ల రోడ్డు త్వరలో మంజూరు కానుందని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు కె రామయ్య గౌడ్, కె యాదయ్య, బి పెంటయ్య బి నరేందర్, సి కృష్ణయ్య, ఆర్ రామస్వామి, బి రవి, తహశీల్దార్ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

మేడ్చల్ టౌన్, ఆగస్టు 23: మేడ్చల్ పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. పట్టణంలోని ఎయిర్‌ఫోర్స్ కాలనీ, సాయిబాబానగర్ కాలనీ, వీకర్‌సెక్షన్ కాలనీ, ఏకలవ్యనగర్, టీచర్స్, సత్యనారాయణ కాలనీలతో పాటు కటిక బస్తీకి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మా తండాను పంచాయతీ చేయాలి



ధారూరు, ఆగస్టు 23: స్టేషన్ ధారూరు పంచాయతీలో అనుబంధ గ్రామంగా కొనసాగుతున్న డీకే తండాను పంచాయతీగా ఏర్పాటు చేయాలని తండావాసులు అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్‌ను కోరారు. వికారాబాద్‌లో స్పీకర్‌ను శుక్రవారం కలిసి వారు వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుతం స్టేషన్ ధారూరు గ్రామపంచాయతీలో ఉన్న తమ తండా అభివృద్ధికి దూరంగా ఉందని వారు వివరించారు. గత ప్రభుత్వంలో తండాను పంచాయతీగా చేయాలని ప్రతిపాదించామని వారు గుర్తుచేశారు.



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులతో బషీర్

పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలి

కందుకూరు,ఆగస్టు 23:రాష్ట్ర ప్రభుత్వం జీవో 28ని వెంటనే రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలంటూ పలు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయ బృందం శుక్రవారం మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నేదునూరు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘం జిల్లా కోశాధికారి డాక్టర్ ఎండీ బషీర్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ఉద్యోగ-ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రధానకార్యదర్శి శ్రీనివాసశర్మ, విజమోహన్‌రెడ్డి, సురేష్, గ్లోరి, కౌసల్య ఎండి లబుధల్లా, కరుణాకర్, శాంతకుమారి పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా ప్రెషర్స్ డే



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు

శంషాబాద్, ఆగస్టు 23 : శంషాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సాయంత్రం ప్రెషర్స్ డే ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. దేశభవిష్యత్తును మార్చే భావిభారత పౌరులుగా ఎదుగాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. బదిలీపై వచ్చిన లెక్షరర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాధవరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కడ్తాల్, ఆగస్టు 23: కడ్తాల మండల కేంద్రానికి చెందిన సిద్దిగారి జంగయ్య అకస్మికంగా మృతి చెందాడు. జంగయ్య మృత దేహాన్ని శుక్రవారం డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.4 వేలు వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వ పరంగా తగిన సాయమందేలా చూస్తానని హామి ఇచ్చారు. పరామర్శించిన వారిలో జహంగీర్‌భాబా, మంకిశ్రీను,ముత్తి జంగయ్య, ఎర్రోళ్ల శ్రీకాంత్, రమేశ్, శ్రీను, శ్రీశైలం, అంజయ్య తదితరులు ఉన్నారు. అదేవిదంగా సిద్దిగారి జంగయ్య కుటుంబాన్ని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి పరామర్శించారు. వ్యక్తిగతంగా రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు లాయక్‌అలీ, రామచంద్రయ్య, జంగమ్మ, వెంకటేశ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు. అదేవిదంగా బాధిత కుటుంబానికి యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్ రూ. 3వేలు ఆర్థిక సాయం అందించి పరామర్శించారు.

మనుగడ కోసం బీఆర్ఎస్ ఆరాటం

- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 23: పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు వచ్చే సబ్సిడీలను రద్దు చేసి, నాలుగు విడతలుగా పంట రుణమాఫీని రూ. 25 వేల రూపాయల చొప్పున విడుదల చేసి వారిని మోసం చేసిందని, అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలల్లోనే రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేసిందని రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణ రెడ్డిలు పేర్కొన్నారు. రైతులు ప్రస్తుతం ఎంతో ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు. శుక్రవారం అజీజ్‌నగర్ చౌరస్తాలోని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్ ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ క్యాడర్‌ను కాపాడుకునేందుకు ధర్నాల పేరిట రైతులను మోసం చేస్తుందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులే దొరకరని చెప్పారు. కేటీఆర్ మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయని ఎద్దేవ చేశారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి రైతుల రుణమాఫీపై గుర్తుకురానిది, 8నెలల్లో రైతులకు రుణమాఫీతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో చేసిందని చెప్పారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పంటల సాగు కోసం వివిధ రకాలుగా సబ్సిడీలు ఇస్తే బీఆర్ఎస్ వాటిని రద్దు చేసిందని గుర్తు చేశారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉండి అనేక పదవులు పొంది నిన్న చేవెళ్లలో నిర్వహించిన ధర్నాలో కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడం ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఉంటుందో లేదో కూడా తెలియని పరిస్థితి ఉందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిబద్దతతో పనిచేస్తూ ప్రజాపాలన అందిస్తున్నట్లు గుర్తుచేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్, తమ్మళి మణయ్య, ఉపాధ్యక్షుడు మర్రీ రవీందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ బొలిగిద్ద సత్యనారాయణ, పురాణం వీరభద్రస్వామి, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, భిక్షపతి తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతూన్న చల్లా నర్సింహారెడ్డి

కొందుర్గులో ఘనంగా ఈదమ్మ బోనాలు

కొందుర్గు, ఆగస్టు, 23: మండల కేంద్రంలో శుక్రవారం ఈదమ్మదేవత బోనాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామస్తులు అమ్మవారికి పూజలు చేశారు. సాయంత్రం మహిళలు బోనాలతో ఊరేగింపుగా బయలుదేరారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించిమొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, సి లింగం, ఈసరి సత్యనారాయణ, అశోక్‌గౌడ్, ఎం యాదగిరి, చిన్నరాజుగౌడ్, ఉరడి నర్సింలు, జగన్ గౌడ్, వెంకటయ్య, శ్రీశైలం, బుచ్చయ్య, సిరియాల, మంజుల, పావని, సునిత, సరస్వతి పాల్గొన్నారు.



ఈదమ్మ ఆలయం వద్ద గ్రామస్తులు

నేటి నుంచి గ్రామ దేవతల బోనాలు

కడ్తాల్, ఆగస్టు 23: కడ్తాల మండల కేంద్రంలో శనివారం నుంచి ఈ నెల 27వ తేది వరకు బోనాల వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ సత్యం యాదవ్ తెలిపారు.నాలుగు రోజుల పాటు కొనసాగే వేడుకలకు ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ కుల సంఘాల నేతలతో కలిసి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కడ్తాల మండల కేంద్రంలో శుక్రవారం బోనాల పండుగ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఏర్పాట్లను పరిశీలించారు. అన్ని ఆలయాల వద్ద భక్తులకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. బోనాల పండుగ వివరాలను చైర్మన్ సత్యం, నిర్వాహకులు మాల మల్లేశ్‌గౌడ్, చేగూరి రాములు, కార్తీక్, రామచంద్ర నాయక్, బోసురవి, కృష్ణ, బాల్‌రాజ్‌లు వివరించారు. శనివారం కాటమయ్య బోనాలు,25న పెద్దమ్మ, మైసమ్మ, మడేలుస్వామి, బీరప్ప, ఈదమ్మ బోనాలు, 26న పోచమ్మ, పలహార బండి ఊరేగింపు, శివసత్తులతో ఘటంమాత బోనాలు, తొట్టెల ఊరేగింపు 27న రేణుక ఎల్లమ్మబోనాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.



విరాళం అందజేస్తున్న గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి బోనాల పండుగ ప్రతీక అని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహ్మారెడ్డి అన్నారు. కడ్తాలలో నాలుగు రోజుల పాటు నిర్వహించే బోనాల వేడుకల ఏర్పాట్లను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సత్యం , నిర్వాహకులతో కలిసి శుక్రవారం లక్ష్మీనర్సింహ్మారెడ్డి పరిశీలించారు. పోచమ్మ దేవాలయం వద్ద బోనాల వేడుకలకు జీఎల్ఎన్‌రెడ్డి రూ. 1,00,116లు నిర్వాహకులకు విరాళం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చేగూరి రాములు, బాచిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాలే మల్లేశ్‌గౌడ్, గుద్దేటి వెంకటేశ్, యాదయ్య, రాములు, వెంకటేశ్, రాజు, శ్రీను, వెంకటేశ్, బాల్‌రాజ్, చేగూరి రాములు, తదితరులు ఉన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న చేవెళ్ల ఎంఈవో అక్బర్

చేవెళ్ల, ఆగస్టు 23 : చదువుతోపాటు క్రీడల్లో విద్యార్థులు భాగా రాణించాలని చేవెళ్ల ఎంఈవో అక్బర్ తెలిపారు. శుక్రవారం చేవెళ్లలో అండర్ 14, అండర్ 17 జోనల్ స్థాయిలోక్రికెట్ పోటీలను ఎంఈవో ప్రారంభించి మాట్లాడారు. 25 పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. విద్యార్థులుచదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. కార్యక్రమంలో జోనల్ సెక్రటరీ ప్రభాకర్, ఉపాధ్యాయులు ఆశీర్వాదం, వ్యాయమ ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఇళ్ల పట్టాలకు పొజిషన్ చూపించాలి

మహేశ్వరం, ఆగస్టు 23: నాగారం గ్రామంలోని సర్వే నెంబర్ 166లో పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలకు సంబంధించి భూమిని చూపించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పల్నాటి నరేష్ అన్నారు. శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ నవతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి పట్టాలుఇచ్చిన పేదలకు పొజిషన్ చూపించాలన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నరేష్

ఉపాధ్యాయుల వేతనాలు చెల్లించాలి

మహేశ్వరం, ఆగస్టు 23: జూలై నెలలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మహేశ్వరం మండలంలోని మహేశ్వరం, రావిర్యాల, తుక్కుగూడ, నాగారం, పెండ్యాల గ్రామాల్లోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై అనునిత్యం పోరాటం చేసేది ఒక్క పీఆర్‌టీయూ సంఘమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జానకీరామ్, వీరమల్లేష్, పాండునాయక్, ఆనంద్‌కుమార్, మహేష్, శ్రీనివాస్, పవన్, బాలీశ్వర్, రాజేష్, శ్రీదర్, కృష్ణ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శంకర్‌పల్లి, ఆగస్టు 23: రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి మృతి చెందాడు. శంకర్‌పల్లి మున్సిపల్‌లోని సింగాపురానికిచెందిన చందిప్ప జంగారెడ్డి(55) తన భార్య కవితతో కలిసి కారులో గురువారం ఉదయం అత్తగారి ఇల్లు అయిన వికారాబాద్‌కు వెళ్లాడు.పనులు ముగించుకుని తిరిగి రాత్రి ఇంటికి వస్తుండగా కచ్చిరెడ్డిగూడ వద్ద లారీని కారు ఢీకొన్నది. ఈఘటనలో జంగారెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, కవిత ఎడమ చేయి విరిగింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హబీబుల్లాఖాన్ తెలిపారు.

చికిత్స పొందుతూ...

శంకర్‌పల్లి, ఆగస్టు 23: చికిత్స పొందుతూ ఓవ్యక్తి మృతి చెందాడు. మాసానిగూడ గ్రామానికిచెందిన రైతు రాంచంద్రయ్య(43)కుటుంబ సమస్యలతో ఈనెల16న పొలం వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం సంగారెడ్డిప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన శుక్రవారం ఉదయం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హబీబుల్లాఖాన్ తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

తలకొండపల్లి,ఆగస్టు 23: ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తలకొండపల్లి మండలం జూలపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన భైరిపాక పెద్ద జంగయ్య(34) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా గురువారం రాత్రి జంగయ్య కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. రాత్రి 8 గంటల సమయంలో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరి సంతోష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి

మాడ్గుల, ఆగస్టు 23 : సంపులో పడి బాలుడు మృతి చెందిన సంఘటన మాడ్గుల మండలంలోని నల్లచెర్వుగ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గొడుగు అచ్చయ్య భార్య రెండేళ్ల క్రితం చనిపోగా తనకు ఉన్న ఇద్దరు కుమారులను ఇంటి దగ్గర ఉంచి వ్యవసాయపనులకు వెళ్లినాడు. గోడుగు చిన్ను(2) పిల్లలతో ఆడుతూ పక్కింటి వారి నీటి సంపులో పడిపోయాడు. గ్రామస్తులు హరీష్, వెంకటయ్యలు సంపులోకి దిగి బాలుడిని బయటకి తీయగా అప్పటికే చనిపోయాడు. .

వీధి కుక్కను చంపిన వ్యక్తిపై కేసు నమోదు

మొయినాబాద్, ఆగస్టు 23: గ్రామాల్లో, పట్టణాల్లో వీధికుక్కలు ఎంతో మంది చిన్న పిల్లలను కరిచి చంపినా... పీక్కుతిన్నా ఇప్పటి వరకు ఎక్కడా ఒక్క కేసు నమోదు కాలేదు. కానీతనను కరిచిన కుక్కను చంపిన వ్యక్తిపై మాత్రం కేసు నమోదైంది. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అజీజ్‌నగర్ గ్రామంలో బుధవారం సాయంత్రం గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తిని వీధికుక్క కరిచింది. దీంతో రాజు ఆ కుక్కను చంపి తాడుతో లాక్కెల్లి ఊరిబయట పడేశాడు. ఇందతా ఓ వ్యక్తి వీడియో తీసి వైరల్ చేశారు. విషయం తెలుసుకున్న స్ట్రే యానిమల్ ఫౌండేషన్ ప్రతినిధి ముడావత్ ప్రీతి గురువారం మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మొయినాబాద్ పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పత్తిపంటను పాడు చేసిన అడవి పందులు

యాచారం, ఆగస్టు 23 : అడవిపందులు అర ఎకరం పొలంలో పత్తిపంటను పాడు చేశాయి. కడ్తాల మండలంలోని పల్లెచెల్కతండాకు చెందిన విస్లావత్ శంకర్ యాచారం మండలంలోని మల్కీగూడ గ్రామానికి చెందిన రమేష్‌కు చెందిన మూడు ఎకరాల పొలం కౌలుకు తీసుకున్నారు. దాంట్లో పత్తిపంట సాగు చేశారు. పత్తిపంట కాయ పడుతుంది. గురువారం అర్ధరాత్రి పందుల గుంపు పంటపై దాడిచేసి పత్తి చెట్లను కొరికి వేశాయి. కాయలను తినివేశాయి.



చెక్కు అందజేస్తున్న గోలి శ్రీనివాస్ రెడ్డి

వైద్యానికి ఆసరాగా సీఎంఆర్ఎఫ్

రాష్ట్ర ఫుడ్‌కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు , ఆగస్టు 23:అనారోగ్యం, ప్రమాదాలకు గురైన వారికి చికిత్సలకు సీఎంఆర్ఎఫ్ ఆసరాగా నిలుస్తుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద అన్ని రకాల వైద్య చికిత్సలు అందించి పేదలకు మనోధైర్యం కల్పించాలని ఆయన కోరారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం శ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు. నారాయణపూర్‌గ్రామానికిచెందిన పాత్లావత్ పద్మకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 26,500ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాల ద్వారా పేదలకు వైద్య చికిత్సలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు,ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు ముందుకు రావాలని శ్రీనివాస్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో నాయకులు రూపం వెంకట్ రెడ్డి, సురమల్ల సుభాష్, కోట శ్రీనివాస్, తారా సింగ్, చలిచీమల సతీష్, భుజంగం, సుమన్‌నాయక్, గణేశ్, శివ పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను శిక్షించాలి

మొయినాబాద్ రూరల్, ఆగస్టు23: జూనియర్ వైద్యురాలి హత్యాచార నిందితులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, బద్లాపూర్ లో చిన్నారులపై లైంగికదాడికి పాల్పడిన నిందితులను శిక్షించాలని ఎన్టీఆర్ విద్యసంస్థల డీన్ డాక్టర్ ఎం.వి రామారావు డిమాండ్ చేశారు. రెండు ఘటనలను నిరసిస్తూ హిమాయత్ నగర్‌లోని ఎన్టీఆర్ విద్యాసంస్థల విద్యార్థులు, సిబ్బందిగ్రామంలో ర్యాలీ నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని నినదించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.వి రామారావు మాట్లాడుతూ మహిళల భద్రతపై ప్రజలకు అవగహన కల్పించాలని, సామాజిక దృక్పథాన్ని మార్పడంలో చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి విద్యార్థులతో కలిసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్‌జే. రెడ్డి, అధ్యాపకులు రాజ్‌దీప్ సర్కార్, అరుణ, పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్టీఆర్ పాఠశాల విద్యార్థులు

కాలుష్య నియంత్రణకు కృషి చేయాలి

ఆమనగల్లు , ఆగస్టు 23:కాలుష్య నియంత్రణకు ప్రభుత్వాలు చేస్తున్న కృషికి ప్రజలంత సహకారం అందించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కోరారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పర్యటించారు. ఆమనగల్లు సురసముద్రం చెరువును పరిశీలించారు. ఆమనగల్లు సురసముద్రం చెరువును మిషన్ కాకతీయ కింద మిని ట్యాంక్‌బండ్‌గా మార్చడానికి రూ.6.50 కోట్లు మంజూరైనా అప్పటి ప్రజాప్రతినిధుల ఉదాసీనత , కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు కాక నిధులు వెనక్కి మల్లాయని కసిరెడ్డి ఆరోపించారు.

అనంతరం పట్టణంలో మాజీ కో-ఆప్షన్ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అబ్దుల్ ఖాదర్ ఖాద్రీ ఏర్పాటు చేసిన ఏకేజే షోరూం ను రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్, టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా, మాజీ జడ్పీటీసీలు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి,ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగన్, వస్పుల మానయ్య, కాలే మల్లయ్య, గుర్రం కేశవులు, మొక్తాల వెంకటయ్య, ధావ ధనుంజయ్య, పాపిశెట్టి రాము,చెన్నారెడ్డి, బాబా, ఫరీద్, నాజర్, అలీం, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న డీఎల్‌పీఓ సతీష్‌రెడ్డి

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి

మొయినాబాద్ రూరల్, ఆగస్టు23: ప్రకృతి సంపదనను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని చేవెళ్ల డివిజన్ పంచాయతీ అధికారి(డీఎల్‌పీవో) సతీష్‌రెడ్డి పేర్కోన్నారు. మండలంలోని హిమాయత్ నగర్ గ్రామంలోని అంబేద్కర్ యువజన సంఘం భవనం ఆవరణలో 'నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద' కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నాటిన మొక్కలను తల్లిపై చూపిన చూపిన ప్రేమ మాదిరిగానే చూపి సంరక్షించాలని కోరారు. యువజన సంఘాలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడే గుర్తింపు లభిస్తుందని పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్యరాణి, కుశంగ్ల బాబు రావు, కంజర్ల శేఖర్, షాబాద్ సందీప్, కంజర్ల రోహిత్, వెంకటరత్నం, నవీన్, ప్రసాద్, ప్రవీణ్, రెడ్డిపల్లి రోహిత్, మహ్మద్ కరీం, రమేష్ ముదిరాజ్, పాల్గొన్నారు.

కుట్ర రాజకీయాలు సాగిస్తున్న బీఆర్ఎస్

ఆమనగల్లు, ఆగస్టు 23: ప్రజావిశ్వాసం కోల్పోయి అధికారానికి దూరమైన బీఆర్ఎస్ నాయకులు అక్కస్సుతో కుట్ర రాజకీయాలు సాగిస్తున్నారని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి , ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డిలు ఆరోపించారు. రుణమాఫీ విషయంలో మాజీ మంత్రులు కేటీఆర్ , హరీశ్‌రావు , ఆపార్టీ నేతలు విషప్రచారం సాగిస్తూ రైతులను అయోమయానికి గురి చేస్తున్నారని వారు మండిపడ్డారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో యాట నర్సింహ్మా, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ పథకాలు, ప్రాజెక్టుల పేరుతో పదేళ్ల రాష్ట్రాన్ని దోచుకుతిన్న బీఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోవడంతో తమ బండారం బయట పడుతుందని జీర్ణించుకోలేక కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని అన్నారు. ప్రజలు తిరస్కరించినా బీఆర్ఎస్ నేతల్లో మార్పు రాలేదని పేర్కొన్నారు. రైతుల రుణమాఫీ విషయంలో అనుమానాలు , అపోహలకు తావులేదని వారు స్పష్టం చేశారు. సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ కాని రైతుల కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందని నర్సింహ్మా , శ్రీనివాస్‌రెడ్డి లు తెలిపారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల మానయ్య, మాజీ ఎంపీపీ దావ ధనుంజయ్య, నాయకులు కాలె మల్లయ్య, పర్వతాలు, బాల్‌రామ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యాట నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేయాలి

తలకొండపల్లి , ఆగస్టు 23: ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని మిషన్ భగీరథ మాజీ వైస్‌చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్‌వ్యాధులు ప్రబలుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామంలో శుక్రవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ కామినేని ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ జయమ్మవెంకటయ్య, శిబిరం నిర్వాహకుడు డాక్టర్ ఉప్పల అఖిల్‌తో కలిసి ఉప్పల వెంకటేశ్ శిబిరాన్ని ప్రారంభించారు.ఈ శిబిరంలో 416 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పరిసరాల పరిశుభ్రత ,సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అశోక్‌గౌడ్, రాఘవేందర్, కృష్ణ, అంజనేయులుగౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

మద్యం తాగి వేధిస్తున్నాడని..

కొడుకుని హత్య చేసిన తండ్రి

- తొండుపల్లి ఇందిరమ్మ కాలనీలో ఘటన



శివకుమార్‌రెడ్డి (ఫైల్)

శంషాబాద్ రూరల్, ఆగస్టు 23: నిత్యం మద్యం తాగి వేధిస్తున్నాడని కన్న తండ్రి కొడకుని గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటన శుక్రవారం శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని తొండుపల్లి ఇందిరమ్మ కాలనీలో చోటు చేసుకుంది. కర్నాటకకు చెందిన దులప్పరెడ్డి, భార్య సరస్వతి ఏళ్ల క్రితమే బతుకుదెరువు కోసం తొండుపల్లికి వలసవచ్చారు. వీరికి ముగ్గురు కుమారులు, అందులో ఇద్దరు హైదరాబాద్‌లో ఉంటున్నారు. మరో కుమారుడు శివకుమార్ రెడ్డి (36)మద్యానికి బానిసగా మారాడు. నిత్యం మద్యం సేవించి తల్లిదండ్రులతో గొడవపడేశాడు. అయితే శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు మద్యం సేవించి ఇంటికి వచ్చిన శివకుమార్‌రెడ్డి తండ్రి దులప్పరెడ్డితో గొడవకు దిగాడు. అప్పటికే ఎన్నోసార్లు సర్దిచెప్పిన వినకపోవడంతో ఆవేశంతో ఇంట్లో ఉన్న కత్తితో శివకుమార్‌రెడ్డి గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు దులప్పరెడ్డి. విషయం తెలుసుకున్న శంషాబాద్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కందుకూరు,ఆగస్టు 23: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం పలు ఫీడర్లలో విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు మండల విద్యుత్ ఏఈ రమేష్‌గౌడ్ తెలిపారు. కందుకూరుటౌన్-2, 11కేవీ, దెబ్బడగూడ వ్యవసాయ విద్యుత్ లైన్‌కు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు తెలిపారు. రాచులూరు టౌన్ 11కేవి విద్యుత్ లైన్‌లో ఏబీఆర్ ఫీడర్ షిఫ్టింగ్ నిమిత్తం గంటపాటు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు తెలిపారు.

డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డికి సన్మానం



విష్ణువర్ధన్ రెడ్డిని సన్మానిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్

ఆమనగల్లు , ఆగస్టు 23: డీసీసీబీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన విష్ణువర్ధన్ రెడ్డిని శుక్రవారం డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ మర్యాద పూర్వకంగా కలిశారు. డీసీసీబీ చైర్మన్‌గా పనిచేసిన నిజాం పాష అనారోగ్యం కారణంగా రాజీనామ చేయడంతో ఎన్నికలు నిర్వహించారు. నూతనంగా చైర్మన్‌గా ఎన్నికైన విష్ణువర్ధన్ రెడ్డిని డీసీసీబీ కార్యాలయంలో వెంకటేశ్‌కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. సహకార సంఘాల బలోపేతానికి , రైతుల సంక్షేమానికి కృషి చేయాలని కొత్త చైర్మన్ ను కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, డైరెక్టర్లు రంగారెడ్డి, వంశీరెడ్డి, భీం రెడ్డి, నర్సింహ్మారెడ్డి, భూపాల్‌రావు,నర్సింహ్మా, లక్ష్మీనారాయణ, జక్కు, రఘునందన్‌రెడ్డి, చంద్రు నాయక్, సీఈవో లక్ష్మీనారాయణ, జీఎం పురుషోత్తంపాల్గొన్నారు.